# నిర్ణీత గమ్యాలు

వేములపల్లి మోహనరావు

పి.వి. కృష్ణారావు

'ఉషారాణీస్ డిన్స్.'

గొంతుకూడా ఆమెలాగే విలక్షణంగా ఉంది అనుకున్నాడు నారాయణ.

'హలో...'

'నమస్తే మేడమ్. నేనూ... నారాయణను మాట్లాడుతున్నాను' కొద్దిగా తడబడ్డాడు. ఓ క్షణంసేపు గుర్తుచేసుకోవాలనే ప్రయత్నంలో మునిగిన మౌనం అవతలివైపునుండి.

'నేనండీ... లక్ష్మీనారాయణ. సెక్రటేరియట్ నుండి మాట్లాడుతున్నాను. అదే... మొన్న మా నాన్నగారూవాళ్ళూ మీ ఇంటికొచ్చారు చూడండి...'

'ఓ... ఎస్... ఎస్... సారీ... ముందుగా మిమ్మల్ని ప్లేస్‌చెయ్యలేకపోయినందుకు. మోస్ట్ అనెక్స్‌పెక్టెడ్ కాల్ కదా! అందుకని!'

'ఇట్సాల్‌రైట్... ఫర్వాలేదు... నో ప్రాబ్లం...' అంతే... తర్వాత మళ్ళీ మాటలు రావడంలేదు.

'మొన్న మీరు రాలేదని మా ఫాదర్ వాళ్ళు డిజప్పాయింటయ్యారు. మీ రేదో క్యాంప్‌లో ఉన్నారనీ, తర్వాత మళ్ళీ మంచిరోజు కుదరదనీ హడావిడిగా ఏర్పాటు చేసేశారనుకుంటాను....'

'అవునండీ...' మళ్ళీ మాటలకోసం వెతుకులాట. రోజూ ఎదురయ్యే అనుభవం కాకపోయినా, ఫియాన్సీతో మాట్లాట్టం ఇంత కష్టమని అనుకోలేదతను.

'చెప్పండి... ఏమిటి ఫోన్‌చేశారు... నాతో ఏదైనా పనుందా!' అడిగిందామె.

ధైర్యం కూడదీసుకున్నాడు నారాయణ.

'సాయంత్రం రవీంద్రభారతికి రాగలరా...ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏదో జరుగుతోందక్కడ...అఫ్‌కోర్స్ మీకు వీలైతేనే.'

'లెట్ మీ చెక్...' డైరీ తిరగేస్తున్న చప్పుడు. 'సాయంత్రం ఆరున్నరకు వస్తాను. ఫర్వాలేదా!'

'ఇట్ సూట్స్ మీ ఫైన్. సరిగ్గా ఆరున్నరకు మీకోసం వెయిట్‌చేస్తుంటాను.'

'అబ్బే. అదేంలేదండీ. ఇలాంటి ప్రదర్శనలకు ఎవరూ రారు కాబట్టి మనం మాట్లాడుకోవడానికి కావలసినంత ప్రైవసీ ఉంటుందని.'

మెత్తగా నవ్విందామె.

'అలాగే... యాజ్ యూ విష్.'

'థాంక్స్ మిస్ రాణీ.'

'మోస్ట్ వెల్‌కం అండ్ ఇట్స్ మై ప్లజర్. కానీ తొందర్లోనే ఆ పిలుపుకు దూరం అవుతున్నందుకు కొంచెం విచారంగా ఉంది.'

అతని ఎడంకన్ను, రిసీవర్ పట్టుకున్న ఎడంచెయ్యి కొద్దిగా వణికాయి.

'నా కర్థంకాలేదు.'

'పెళ్ళయ్యాక నన్ను మిస్ రాణీ అని పిలిచేవారింకెవరుంటారు మహానుభావా! మిస్ మిస్సయ్యి మిస్సెసవుతుంది గదా!'

'ఓ... అదా...' అంటూ నవ్వాడతను రిలీఫ్‌గా.

'ఉండనా మరి... సాయంత్రంలోపు చాలా వర్కు పూర్తిచెయ్యాలి.' అందామె అభ్యర్థిస్తున్నట్లు.

'ఓకే. కారీఆన్...'

'నో...నో... అలాంటి పదాలు పెళ్ళయిన ఆడవాళ్ళను విష్ చెయ్యడానికే గానీ నాలాంటివాళ్ళకోసం కాదు.'

ఓ నిమిషం తర్వాత అతనికి అర్థమై కొంచెం గట్టిగా నవ్వాడు 'యూ నాటీ!' అంటూ.

ఫోన్ పెట్టేసిన తర్వాత చాలా సేపటి వరకూ అతనికి ఆ సంభాషణే గుర్తుకురాసాగింది. ఫోన్ చెయ్యడానికి ముందున్న టెన్షన్, బిడియం తర్వాత తేలిగ్గా మాయమయిపోయాయి. అసలు డయల్ చేసేముందే జేబురుమాలుతో ఎన్నిసార్లు మొహం తుడుచుకున్నాడో! లైను కలసేలోపు చెమటతో తడిసి రిసీవర్ ఎన్నిసార్లు కిందకు జారిపోబోయిందో!

ఫన్నీ! వెరీ ఫన్నీ... తనింత నెర్వస్‌గా ఫీలవుతుంటే ఆ అమ్మాయి మంచినీళ్ళు తాగినంత తేలిగ్గా తీసుకుంది. ఎంత ఈజీ గోయింగ్. నిజంగా భర్త చికాకులన్నీ ఇలా క్షణాలమీద మరిపించే లైఫ్‌పార్ట్‌నర్ దొరకడం ఎంత అదృష్టం. కాబోయే మొగుణ్ణి అప్పుడే మొదటి పరిచయంలోనే 'మహానుభావా' అని పిలుస్తోందంటే ఈ అమ్మాయి చాలా యాక్టివ్ అన్నమాట. మేడ్ ఫర్ ఈచ్ అదర్ అంటే ఇదేనేమో. తను చాలా సాఫ్ట్ మరి.

సాయంత్రం ఆరింటివరకూ అతని పెదవులమీద కనీకనిపించని చిరునవ్వు అలాగే చెదరకుండా ఉంది. అసలు ముందు ఆ అమ్మాయి ఫొటోని చూసి



నప్పుడే అనుకున్నాడతను ఆ అమ్మాయిలో ఏదో ప్రత్యేకత ఉందని! ఆ కళ్ళు ముఖ్యంగా హిప్నాటిస్టులకుండవల సినవి. ఎంత వద్దనుకున్నా తనవైపే చూపుల్ని తిప్పుకునేంత ఆకర్షణీయమైన ఆ మొహంలో కొట్టవచ్చినట్లు కన్పించే ఓ లక్షణం ఉంది. చాలా సేపు చూసిన తర్వాత గానీ నారాయణకు అదేమిటో అర్థంకాలేదు. నిర్లక్ష్యం... ఎస్...అదే ... ఎవరు ఎన్నిపేర్లుతో పిల్చినా ఆత్మ గౌరవం, ఆత్మవిశ్వాసం అని దానికి మెరుగులు దిద్దినా, ప్రతి మనిషిలోనూ అంతర్లీనమై ఉండే నిర్లక్ష్యభావం. లోకానికి ఎదురీదే స్వభావం.

ఏమైనా, రూపాన్ని చూసి వ్యక్తిత్వాన్ని అంచనావేయడం నారాయణ పద్ధతి కాదు. పెళ్ళిచూపులనే అరగంట తాత్కాలిక తతంగంలో ఎవరైనా సాధించగలిగేదేమిటో అతనికి అర్థం కాదు. అందుకే అతను క్యాంప్ వంకతో వెళ్ళడం మానేశాడు.

లేడిపిల్లలాంటి ఆడపిల్ల నర్థంచేసుకోవడం కేవలం ఈ మహాజనారణ్యంలో తను తిరుగుతున్నప్పుడే సాధ్యం. బోనుల్లాంటి నాలుగ్గోడల ఇనప్పెట్టెల్లో చాపల మీద తలదించుకుని కూర్చున్నప్పుడు కాదు.

టైమవుతుండటంతో ఫైల్స్ క్యాబినెట్‌లో సర్దేసి తాళాలువేసి లేచాడతను. స్కూటర్ తాళాలు తీసుకుని బయటికి నడుస్తుండగా అటెండర్ ఎదురయ్యాడు.

'సార్. మిమ్మల్ని మినిస్టర్‌గారు పిలుస్తున్నారు.'

'ఓహ్ ... నాట్ నౌ... నాట్ నౌ.' బాధగా మూలిగిందతని మనసు. కాళ్ళు మాత్రం తప్పనిసరిగా ఛాంబర్‌వైపు దారితీశాయి.

◆ ◆ ◆

'నారాయణా... వాట్ హాపెండ్ ... ఈరోజు చురుగ్గా లేవే ... ఒంట్లో బావుండలేదా!' ఎనిమిదిన్నరకొచ్చిందమంత్రిగారికి ఆ అనుమానం.

చూస్తున్న ఫైల్స్‌లోనుండి తల పైకెత్తి నీరసంగా నవ్వాడు. 'అదేం లేదు సర్.' 'సారీ టూ బాదర్ యూ... కానీ ఈ రిపోర్టు రేపు పదింటికల్లా సీఎమ్‌గారి టేబుల్ మీద ఉండాలి! లేకపోతే...ఎందుకులే...కానీ తొందరగా.'

కాబోయే భార్యతో మొదటి డేట్ అంత దారుణంగా చిత్రవధ చేయబడటం నుండీ అంత త్వరగా తేరుకోలేక పోయాడు నారాయణ. ఆ మర్నాడూ తర్వాత, రెండుమూడుసార్లు ఫోన్ చేశాడు జరిగింది చెప్పి క్షమాపణ అడుగుదామని. కానీ ఉష దొరకలేదు: కనీసం ఆమె వచ్చింతర్వాత మెసేజ్ చూసుకుని ఫోన్‌చేస్తుందని తన ఫోన్‌నెంబర్ ఇచ్చాడు. కాని మళ్ళా ఆమె ఫోన్‌కూడా చేయలేదు.

◆ ◆ ◆

వారం తర్వాత వాళ్ళ నాన్నగారు అడిగారు నారాయణను.

'ఏమంటావ్‌రా మరి! వాళ్ళేమో అవతల తొందరపడుతున్నారు. నువ్వేమో ఎటూ తేల్చవ్... ఏమిటసలు సంగతి.'

'అబ్బే...ఏంలేదండీ...ఈ వైజాగ్ ట్రిప్పు పూర్తికాగానే ఓసారి ఆ అమ్మాయితో మాట్లాడి...'

'ఎప్పుడు నీ ప్రయాణం?'

'శనివారం రాత్రికి గోదావరికి వెళ్దా మనుకుంటున్నాను.

'అదే ట్రైనులో ఆ అమ్మాయి కూడా వెళ్తోందనుకుంటాను. వైజాగ్‌లో వాళ్ళ స్నేహితురాలి పెళ్ళేదో ఉందట. మొన్న వాళ్ళ తమ్ముడు బజార్లో కనిపించినప్పుడు చెప్పాడు.'

ఓ క్షణంపాటు అతని గుండె లయ తప్పింది.

దాదాపు పన్నెండు గంటల సాహచర్యం. జీవితాంతం కలిసి తామిద్దరూ జరపబోయే ప్రయాణానికి ఈ ప్రయాణమే నాంది పలకడం నిజంగా శుభ సూచకం.

◆ ◆ ◆

ఆ రోజు ఆఫీస్‌కు వెళ్ళగానే తన టికెట్ కాన్సిల్ చేసి ఫస్ట్ క్లాస్ కూపే బుక్ చేయించాడు.

ఎన్ని విషయాలు మాట్లాడుకోవాలి. ఒకరి అభిప్రాయాలు మరొకరు తెలుసుకోవాలి. మొదటి రాత్రితో మొదలుపెట్టి పుట్టబోయే పిల్లల పెళ్ళిళ్ళ వరకూ ఎన్నో ప్లాన్ చేసుకోవాలి. సరిపోతాయా పన్నెండు గంటలు?

ఆ రోజు రెండున్నరకు వాళ్ళ ఆఫీసులోనే దొరికింది ఉష. పలకరింపులూ సారీలూ అయ్యాక ప్రయాణం సంగతి చెప్పాడు నారాయణ.

'కానీ నేనా ట్రైన్‌లో రావడంలేదు. పెళ్ళికూతురుతోపాటు రేపొద్దున్నే కార్లో వెళ్తున్నాను.'

'మీ కోసం నేను టికెట్ కూడా బుక్ చేయించేశాను. మీరు రాలేకపోతే చాలా డిజప్పాయింట్ అవుతాను. ఆలోచించండి. అదీగాక మనం మాట్లాడుకోవలసినవెన్నో ఉన్నాయి... ప్లీజ్.'

ఓ క్షణం తటపటాయించి అంది ఉష. 'సాయంత్రం చెబుతాను మీకు ఏ సంగతీ. ఈలోపు మా ఫ్రెండ్‌తో కూడా ఓ మాట చెప్పి...'

'ఎలా అయినా సరే మీరు నాతో రావాలి. ఇంతకన్నా ఎక్కువగా మిమ్మల్ని ఇబ్బందిపెట్టే అధికారం నాకు ప్రస్తుతానికి లేదనుకోండి. కానీ రేపొద్దునే ఒకవేళ అటువంటి సందర్భాలు వస్తే వాటిల్లో ఒకదాన్ని ఇప్పుడే మీకు త్యాగం చేసేస్తున్నాను.' కొద్దిగా నవ్వి అన్నాడు.

అవతలి వైపునుండి రెస్పాన్స్ లేదు. తను చెప్పింది ఆమె కర్థంకాలేదా?

'ఓకే. సాయంత్రం ఫోన్ చేస్తాను. ఉంటాను' ఫోన్ పెట్టేసిందామె.

అతను నివ్వెరపోయాడు. అంత ఎబ్రప్ట్‌గా ఆమె సంభాషణను తుంచేస్తుందనుకోలేదు. ఎందుకింత కోల్డ్‌గా ఉంది తను! మొదటి మీటింగ్‌లో కలిగిన ఆశాభంగం నుంచి ఆమె తేరుకో లేదా ఇంకా!

మొదటి సంభాషణకూ దీనికీ ఎంత తేడా!

ఆ సాయంత్రం ఆమె ఫోన్‌చేసి తను అతనితోనే వస్తున్నానని చెప్పే వరకూ అతను అన్యమనస్కంగానే ఉన్నాడు. అప్పటినుండీ అతని హడావిడి ప్రారంభమైంది. మొట్టమొదటిసారి ఆమె ఎదురైనప్పుడు ఎలా చెయ్యాలి. మొదట ఏ టాపిక్ మొదలెట్టాలి. ఫామిలీ ప్లానింగ్ వరకూ ఆగాలా!

కావలసినంత ఏకాంతం కాబట్టి ఆమెను అనుకుని కూర్చోవచ్చు. ఏమైనా అనుకుంటుందేమో! ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటే బాగుంటుందా! బెజవాడ స్టేషన్ దాటింతర్వాత తను నిద్రకు ఆగలేక పడుకుంటా నంటుందేమో. అప్పుడు దొంగతనంగా ఓ ముద్దు పెట్టుకుంటే... ఛీ పాడు... ఆ ఆలోచనకు అతనికే సిగ్గేసి మొహం కప్పుకుని వేళ్ళ సందుల్లోంచీ చూస్తే ఇతని మూకాభినయం చాలా కుతూహలంతో చూస్తోంది లేడీ టైపిస్టు.

మరు నిమిషంలో స్వీట్ నథింగ్స్‌కు గుడ్‌బై చెప్పేసి ఈ లోకంలో పడ్డాడు.

* * *

ఆ రోజే తన పెళ్ళి అన్నంత కంగారుగా తిరిగేస్తున్నాడు నారాయణ శనివారంనాడు. పెద్దవాళ్ళెవరైనా చూస్తే రెండు దిళ్ళెందుకురా అని అడుగుతారని ఎవరూ చూడకుండానే బెడ్డింగ్ సర్దేశాడు. మల్లెపూలు స్టేషన్‌కు వెళ్ళే దార్లో దొరుకుతాయో లేదో... ఆఫీసు నుంచీ వచ్చేప్పుడు పుల్లారెడ్డి స్వీట్స్ దగ్గర ఆగాలి. మధ్యాహ్నం పన్నెండింటికల్లా ఇంటికొచ్చెయ్యాలి.

ఆరోజు పదకొండింటికి మంత్రిగారి పి.ఏ. వచ్చాడు నారాయణ దగ్గరకి. 'సాయంత్రం వైజాగ్ వెళ్తున్నావట గదా! ఎమ్ డీ గారికి ఓ ఫైలిస్తాను తీసుకెళ్ళి అందజెయ్యి.'

'అలాగే సర్' అన్నాడు నారాయణ.

'సాయంత్రం నువ్వు వెళ్ళేప్పటికి రెడీచేసి పెడతాను. నా రూంకి వచ్చి కలెక్ట్‌చేసుకెళ్ళు'.

'ఓకే సర్.'

◆ ◆ ◆

స్టేషన్‌కు వెళ్ళేముందు ఆఫీసుకు వచ్చాడు నారాయణ, బయట ఆటోలో సామాను అలాగే ఉంచి.

పీ ఏ అతన్ని కూర్చోమని అటెండర్‌ని మంత్రిగారి ఛాంబర్‌లోకి పంపించాడు. రెండు నిమిషాల్లో అతను తిరిగి వచ్చి 'మంత్రిగారింకా రాలేదు సర్' అన్నాడు.

'ఐదు నిమిషాలుండు. ఇప్పుడే వస్తానని వెళ్ళారాయన. వచ్చేస్తారు. రాగానే సంతకం పెట్టేస్తారు తీసుకెళ్దువుగాని.'

బయటకు వచ్చి కారిడార్‌లో నిలబడ్డాడు నారాయణ. ఐదు నిమిషాలు

పదిహేను నిమిషాలయ్యాయి. అమాత్య వర్యుల ఆచూకీ లేదు. ట్రైన్ టైం దగ్గరపడుతోంది. అతనిలో టెన్షన్ పెరిగిపోతోంది. ఇంకో అయిదు నిమిషాల తర్వాత అతను పియ్యే రూంలోకి వెళ్ళాడు. తర్వాత అయిదు నిమిషాల కోసారి నాలుగుసార్లు వెళ్ళిన తర్వాత పియ్యే చెప్పాడు. 'ఇప్పుడే ఫోన్‌చేశారు మినిస్టర్‌గారు. బయలుద్దేరి వచ్చేస్తున్నారు. వెళ్ళిపోదువుగాని.'

'నాకు అవతల ట్రైన్ మిస్సవుతుంది సర్...'

'అయితే అవనీయవయ్యా. అదీగాక పోతే తర్వాత ట్రైన్‌కు వెళ్ళవచ్చు. అందులోనూ రేపు ఆదివారమే కదా... ఆన్‌డ్యూటీ వెళ్ళేప్పుడు సగం పని వదిలేసి వెళ్తావా ఏం?'


ఈ ప్రయాణం ప్రాముఖ్యం గురించి తను ఎవరికైనా చెప్పవలసి వచ్చినా ఆ వ్యక్తి ఖచ్చితంగా మంత్రిగారి పియ్యే మాత్రం కాదు.

♦ ♦ ♦

మంత్రిగారు సంతకంపెట్టీ పెట్టకుండానే ఆయన చేతిలోనుంచి ఫైల్ లాక్కున్నంత పనిచేసి బయటికి పరుగెత్తాడు నారాయణ. ఆటోలో కూర్చుంటూనే డ్రైవర్ చేతిలో వంద రూపాయల నోటు పెట్టి 'నీ ఇష్టం వచ్చినంత స్పీడ్ పోనీ' అన్నాడు.

పెళ్ళి సంగతి ఎలా ఉన్నా చావు మాత్రం అతనికి రెండుసార్లు చాలా దగ్గరగా వచ్చి కొద్దిలో తప్పుకుంది.

అతను లగేజ్ తీసుకుని ప్లాట్‌ఫాం మీదకు చేరుకునేప్పటికి గోదావరీ ఎక్స్‌ప్రెస్ ఆఖరి కంపార్ట్‌మెంట్ అప్పుడే దాటి వెళ్ళిపోతోంది. ఒక్కసారిగా అతన్ని చెప్పలేనంత నిస్సత్తువ ఆవరించింది. బెడ్డింగ్ కింద పడేసి దాని మీద చాలా సేపు కూర్చుండిపోయాడు.




ఉష తప్పకుండా వెళ్ళిపోయి ఉంటుంది. ఈ ట్రైన్‌లో వెళ్ళకపోతే పెళ్ళికి అందుకోలేదు. అందులోనూ తన మాట ప్రకారం ప్రయాణం పోస్ట్‌పోన్ చేసుకుంది. లేకపోతే పెళ్ళి కూతురుతోనే వెళ్ళిఉండేది కాదూ!

టికెట్లు రెండూ కాన్సిల్ చేసి నీరసంగా తిరుగుముఖం పట్టాడతను.

♦ ♦ ♦

సరిగ్గా పదిరోజుల తర్వాత అతనికి ఆఫీసుకో రిజిస్టర్డ్ లెటర్ వచ్చింది. ఓ ఉత్తరం, ఫోటో ఉన్నాయి అందులో. ఫోటోలో ఉష పక్కన ఓ స్ఫురద్రూపి ఉన్నాడు. ఏ కోణంలో చూసినా రాజసం ఉట్టిపడుతోందతనిలో. దాన్ని పక్కన పెట్టి ఉత్తరం విప్పాడు.

'డియర్ మిస్టర్ నారాయణా... అతి చిన్న సంఘటనలు మనిషి జీవితగమనాన్ని అనూహ్యమైన మలుపుల్ని తిప్పుతాయంటే ఇంతవరకూ నమ్మలేదు. కానీ నా జీవితంలోనే అలాంటిది జరిగినప్పుడు నమ్మకుండా ఎలా ఉండగలను!

ఈ ఫోటోలో వ్యక్తి నిన్నటినుండీ మాశ్రీవారు. రిజిస్ట్రార్ ఆఫీస్‌లో హడావిడిగా కార్యక్రమం ముగించడంతో ఎవర్నీ పిలవడం కుదరలేదు.

ఈ ఉత్తరం మీకు వ్రాయడానికి ఓ ప్రత్యేకమైన కారణం ఉంది. అదేమిటంటే మా పెళ్ళికి ముఖ్యకారకులు మీరు. మీకు ఆశ్చర్యంగా ఉండవచ్చు. కానీ ఇది నిజం.

ఆరోజు మీరు నన్ను రవీంద్రభారతికి రమన్నారు. ఒంటరిగా నిలబడిన నేను మీకోసం ఎంతోసేపు వెయిట్‌చేశాను. అక్కడే అప్పుడే ఆయన కలిశారు. మాటలు పరిచయాలకు దారితీశాయి. ఈరోజు ఆలోచిస్తూంటే అనిపిస్తోంది, ఆరోజే మా గమ్యాలు నిర్ణయింపబడిపోయి ఉంటాయని.

గోదావరీ ఎక్స్‌ప్రెస్ దగ్గర మీ కోసం ఎదురుచూస్తున్న నన్ను ఆయన పలకరించారు. ఆయన కూడా వైజాగ్ వస్తున్నారట. రిజర్వేషన్ లేదాయనకు. ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ మీద కూపే మనిద్దరి పేరుమీద రిజర్వుచేయబడి ఉంది. బండి కదిలేవరకూ మీ కోసం చూసి చూసి మేముద్దరం ఎక్కేశాం. టీ టీ తో విషయం చెప్పి ఆ కూపే తీసుకున్నాం.

కొన్ని గంటల ప్రయాణం కొన్ని సంవత్సరాల అనుబంధానికి నాంది పలుకుతుందని నేనూహించలేదు.

విజయవాడ స్టేషన్ వచ్చే వరకూ ఇద్దరం ఒకరి మనసు ఒకరికి విప్పి చెప్పుకున్నాక ఒకరికొకరం అని అర్థమైపోయింది. ఆ అర్ధరాత్రి విజయవాడ దాటిన తర్వాత... వెల్... మిమ్మల్ని కించపరచాలనీ, అవమానించాలనీ నా ఉద్దేశ్యం కాదు గానీ... మీకు కనీసం ఆ సందర్భంలో నన్ను ముద్దె పెట్టుకునే ధైర్యం అయినా ఉంటుందని నేననుకోను... ఎందుకంటే కాబోయే జీవిత భాగస్వామికోసం రోజూ ఉండే మీ మామూలు సమస్యల నుండీ కొన్ని క్షణాలైనా తప్పుకుని చెప్పినమాట నిలబెట్టుకునేపాటి ధైర్యం కూడా మీకు లేదు కాబట్టి......

...అలా ఆ రాత్రి మేమిద్దరం ఒకటయ్యాం. తర్వాత రిజిస్ట్రార్ ఆఫీస్‌లో మా పెళ్ళి జరిగిపోయింది.

నిజం చెప్పాలంటే మీకు సారీకూడా చెప్పాలనిపించడం లేదు. ఎందుకంటే జరిగిన రెండు సంఘటనల్లోనూ తప్పంటూ ఉంటే మీదే కానీ నాది కాదు గనక.

మీకు కృతజ్ఞతలు చెప్పడానిక్కూడా మనస్కరించడం లేదు. కారణం జరిగిందంతా యాదృచ్ఛికమే గానీ మీరు కావాలని ఏర్పాటు చేసింది కాదు గనక.

ప్రతి మనిషికీ కొన్ని బలహీనతలుంటాయి. మీ బలహీనత ఎటువంటి పరిస్థితుల్లోనూ మీ రొటీన్ నుండి బయటికి రాలేకపోవడం. నా బలహీనత ఎటువంటి పరిస్థితుల్లోనూ ఒకరి కోసం వేచి ఉండకపోవడం. నిరీక్షణలో జీవితాలు బలి చేసుకున్న ప్రేమికులెందరో నాకు తెలుసు. నాది ఆ పంథా కాదు. ఒకవేళ నాకు ఆయన తారసపడకపోయినా నేను మీతో పెళ్ళికి ఒప్పుకుని ఉండేదాన్ని కాదు. కారణం పైన చెప్పిందే. ఒకరి కోసం వెయిట్ చెయ్యడం నా తత్వానికే విరుద్ధం అని.

అనుకున్న సమావేశాలు అనుకోని కారణాలవల్ల ఆగిపోతే కలిగే నిరాశా నిస్పృహలను సంజాయిషీలు ఓదార్చలేవు. కానీ అనుకోని సమాగమాలు ఒక్కోసారి ఆ లోటును పూర్తిగా భర్తీ చేస్తాయని నా భర్త రుజువుచేశారు.

మీ కనిపిస్తుండవచ్చు... పెళ్ళంటే ఇంత తేలికా!... జస్ట్ లైక్ దట్... అని. కానీ ఒక్కసారి బయటికి వచ్చి చూడండి. శరవేగంతో పరుగెత్తుతున్న ఈ తరంలో ఒకరి కోసం ఒకరు ఆగడం త్యాగం అనిపించుకోదు. తెలివి తక్కువ అనిపించుకుంటుంది.

విష్ యూ ఆల్ సక్సెస్ ఇన్ యువర్ నెక్స్ట్ మ్యాచ్."

